క్లుప్తంగా

విధుల్లోకి ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ శిక్షణ కోసం నెల రోజులపాటు వెళ్లిన వెంకటరత్నమ్మ శుక్రవారం తిరిగి విధుల్లో చేరారు. ఎంపీడీఓగా పదోన్నతి రావడంతో నెల రోజులపాటు శిక్షణకు వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో ఏఓ మోతీ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ చిన్నరెడ్డెప్ప తెలిపారు. అందులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు సేవా కార్యక్రమాలు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల సందర్భం శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ మణినాయుడు తెలిపారు. మెయిన్ రోడ్డు వద్ద ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేస్తామని, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

గుడిమల్లం ఆలయ హుండీ ఆదాయం రూ.2.45 లక్షలు

ఏర్పేడు: గుడిమల్లంలో వెలసిన పరుశురామేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 34 రోజులకు గాను హుండీలోని కానుకల ద్వారా రూ.2,20,902లు, అన్నదానం హుండీల ద్వారా రూ.24, 875లు మొత్తం రూ.2,45,777 ఆదాయం వచ్చినట్లు ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి దేవాదాయ శాఖ డివిజన్ తనిఖీ అధికారి ఫణిరాజసేన, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు పాల్గొన్నారు.

కొలువుదీరిన పాలకమండలి

నాగలాపురం: సురుటుపల్లిలో వెలసిన శ్రీపల్లి కొండేశ్వరాలయం నూతన పాలక మండలి కొలువుదీరింది. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ పది మంది సభ్యులతో కూడిన పాలక మండలిని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. పిచ్చాటూరు మండలం కీళ్లపూడికి చెందిన పద్మనాభరాజును ఆలయ చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌తోపాటు సభ్యులుగా పి.హంస, కె.శ్రీనివాసులు, బి.జయంతి, ఎస్.దేవి, కె.కవిత, కె.నెల్సన్ మండేలా, ఎ.హేమంత్ కుమార్, డి.నాగభూషణమ్మలతో ఈఓ లత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ

వరదయ్యపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు మండల ఎస్టీయూ నాయకులు ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిట్టి చెంగయ్య, వెంపళ్ల చిన్నయ్య మాట్లాడుతూ.. బోధనేతర కార్యక్రమాలతో పాఠశాలలో పిల్లలకు సరైన విద్య అందించలేక పోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు విద్యాబోధన తప్ప ఇతర కార్యక్రమాలు అమలు చేయరాదని డిమాండ్ చేశారు. సి.శ్యామసుందర్, రవిబాబు, మోహన్‌రావు, సూరిబాబు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు గ్రామంలోని దళితులు శుక్రవారం ఇంటి స్థలాల కోసం సీపీఎం ఆధ్వర్యంలో భూమి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నలుగూరి రమణయ్య మాట్లాడుతూ వెస్టువరత్తూరు గ్రామ రెవెన్యూలోని 112 సర్వే నెంబర్‌లో ఖాళీగా ఉన్న 3.75 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలు లేని దళితులు ఆక్రమించుకున్నారని, వారికి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని దళితులకు ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తిరుపాలయ్య, సుబ్బయ్య, శంకరయ్య, బాబు, గురవయ్య, నాగూర్, వీరాస్వామి, గంగయ్య, విక్రమ్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

నెరవేరని కల


తలారివెట్టు సమీపంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థలం

దేవుడు కరుణించినా పూజారి కరుణించని సామెత చందాన ఉంది వరదయ్యపాళెం మండలంలో అధికారుల తీరు. పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వరదయ్యపాళెంలో ప్రభుత్వ భూమి లేని కారణంగా రైతుల నుంచి భూములను కొనుగోలు చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అప్పటి ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. కూటమి అధికారంలోకి వచ్చినా పట్టాల పంపిణీ చేయకపోవడంతో పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. – వరదయ్యపాళెం

- ఇళ్ల పట్టాల పంపిణీలో తీవ్ర జాప్యం
- వరదయ్యపాళెంలో నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న 450 మంది లబ్ధిదారులు
- పేదలపై కూటమి ప్రభుత్వ చిన్నచూపు


లేఅవుట్

మండలంలోని వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలో సొంతిల్లు లేని నిరుపేద వర్గాలకు చెందిన 450 కుటుంబాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. వారికి ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసేందుకు గత ప్రభుత్వంలో ఉత్తర్వులు జారీ చేశారు. వరదయ్యపాళెంలో ప్రభుత్వ భూమి లేకపోవడంతోసమీపంలోని బుచ్చినాయుడుకండ్రిగ మండలం తలారివెట్టు వద్ద సర్వే నెంబర్లు 130, 131, 135, 136, 136/2లలోని 15.31 ఎకరాల ప్రైవేటు రైతుల భూమిని గుర్తించారు. ఎకరా రూ. 12.50 లక్షలకు కొనుగోలు చేసింది. రైతులకు రూ.1.91కోట్ల పరిహారాన్ని అందజేసింది.

పరిహారం పంపిణీ చేసినా..

రైతులకు పరిహారం అందజేసినప్పటికీ భూమిని స్వాధీనం చేసుకుని పట్టాలను పంపిణీ చేయాల్సిన రెవెన్యూ అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. ముళ్ల చెట్లు తొలగించారే తప్ప లేఅవుట్ పనులు చేయలేదు. వీధులు, ప్లాట్ల కేటాయింపులకు సంబంధించి హద్దు రాళ్లు నాటలేదు.

హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం

మండలంలోనే తలారివెట్టు వద్ద అతిపెద్ద లేఅవుట్ ఏర్పాటవుతున్న ఇప్పటి వరకు రోడ్ల విస్తరణ, మౌలిక వసతులు కల్పించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

కూటమి నిర్లక్ష్యం

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో తలారివెట్టు వద్ద ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు కట్టించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వంలో తీసుకున్న ఈ నిర్ణయంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోంది. 16 నెలలుగా పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు అందని ద్రాక్షలా మార్చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పలు సమావేశాల్లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



తలారివెట్టు వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ విషయం ఇటీవలే నా దృష్టికి వచ్చింది. అయితే పూర్వాపరాలు పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. తదుపరి వారి ఆదేశాల మేరకు పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

–సుధీర్ రెడ్డి, తహసీల్దార్, వరదయ్యపాళెం

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో పల్లం విద్యార్థిని ప్రతిభ

ఏర్పేడు: కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలలో ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శిరీష ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం తీగల ఆనంద్ తెలిపారు. విద్యార్థినికి సెపక్ తక్రా క్రీడలో తిరుపతి నుంచి కోచ్‌ను పిలిపించి శిక్షణ ఇప్పించామని చెప్పారు. దీంతో ఆమె క్రీడల్లో రాణించి పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడం సంతోషంగా వుందన్నారు. శిరీష ప్రతిభ కనబరచడానికి కారణమైన పీఈటీ వాణి, సోమశేఖర్‌ను అభినందించారు.


విద్యార్థిని శిరీషను అభినందిస్తున్న హెచ్ఎం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రేణిగుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో రేణిగుంట ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థి యతీష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ గౌతమి, చైర్మన్ మురళీకృష్ణ తెలిపారు. వారు విద్యార్థిని అభినందించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజాఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. తద్వారా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కష్ణారెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, తొట్టంబేడు మండల అధ్యక్షుడు కోగిలి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, నియోజవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సురావారి సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


స్వాతి (ఫైల్)

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి– వెంకటగిరి రోడ్డు మార్గంలో శుక్రవారం అరవకుత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వాతి (24) అనే మహిళ మృతి చెందింది. ఉడమలపాడు గ్రామానికి చెందిన గురవయ్య ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా, భార్య స్వాతి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నారు. తమ విధులు ముగించుకుని ఆ దంపతులు ఆరు నెలల కుమారుడితో శ్రీకాళహస్తి నుంచి బైక్‌పై ఉడుములపాడులోని తమ ఇంటికి బయలుదేరారు. శ్రీకాళహస్తి నుంచి వెంకటగిరి వైపు వెళ్తున్న టిప్పరు బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టడంతో స్వాతి రోడ్డుపై పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గురవయ్య, బాబు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీటీవో ప్రొసీజర్ ద్వారా గుండె వైద్యం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో గల అమర హాస్పిటల్‌లో జపాన్‌కు చెందిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సెరికావా టకేశి అత్యంత కష్టతరమైన ప్రొసీజర్ ద్వారా వైద్యం అందించి విజయం సాధించారు. హాస్పిటల్లో శుక్రవారం చైర్మన్ గౌరినేని డాక్టర్ ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ గౌరినేని రమాదేవి వైద్యులను అభినందించారు. వారు మాట్లాడుతూ అమర హాస్పిటల్‌లో గుండెకు సంబంధించిన రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోయి, రాయి లాంటి కాఠిన్యాన్ని సంతరించుకున్న మూడు క్లిష్టమైన కేసులను సీటీవో పద్ధతి ద్వారా విజయవంతంగా సరిచేసినట్టు తెలిపారు. అత్యంత కష్టతరమైన ప్రొసీజర్‌ను జపాన్‌కు చెందిన ప్రసిద్ధ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సెరికావా టకేశి ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. భాగ్యలక్ష్మి, డాక్టర్లు వెంకట శివకృష్ణ, గురజాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థినికి తీవ్ర గాయాలు

రేణిగుంట: పాత రేణిగుంట సమీపంలో రేణిగుంట కడప ప్రధాన రహదారిలో శుక్రవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. రేణిగుంట జ్యోతి నగర్‌కు చెందిన మధుసూదన్ శుక్రవారం ఉదయం తన కుమార్తె దీన (19)ను అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో వదిలేందుకు బైక్‌లో బయలుదేరాడు. పాత రేణిగుంట సమీపంలో లారీ ఢీకొంది. విద్యార్థినికి తీవ్రంగా గాయపడింది. ఆమె తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానికులు సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తంగేళ్లపాళెం పీఏసీఎస్‌లో తెలంగాణ అధికారులు

తొట్టంబేడు: తంగెళ్లపాలెం సింగిల్‌విండో కార్యాలయాన్ని (పీఏసీఎస్) శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆర్‌సీఎస్ ఇన్‌చార్జి బి.నందకిషోర్, తదితరులు సందర్శించారు. వ్యాపార లావాదేవీలు, ఈకేవైసీ నమోదు, రుణాల పంపిణీ, హార్డ్‌వేర్ కిట్లు తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, డీఎల్‌పీవో సురేష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.నాగభూషణం, సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్, సీఈవో చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితుని అరెస్టు చూపుతున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని పంగూరు మార్గంలో ఉన్న ఈదుల కాల్వ వద్ద ఎక్సైజ్ పోలీసులు శనివారం ఒకరిని అరెస్టు చేసి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి మండల సరిహద్దులో పంగూరు సమీపంలోని ఈదులకాల్వ వంతెన వద్ద శ్రీకాళహస్తి మండలం నారాయణపురానికి చెందిన చిర్రి వెంకటేష్ బ్యాగులో మద్యం సీసాలతో వస్తుండగా పట్టుకున్నామని అధికారులు తెలిపారు.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ

రేణిగుంట: యూఎస్‌ఏ ఏకం సంస్థ ఆర్థిక సహకారంతో సోషియల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు శుక్రవారం రేణిగుంట మండలం పద్మానగర్, చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాల్లోని 30 మంది గర్భిణులకు 18 రకాల పోషకాహార కిట్లు అందజేశారు. ఏకం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నీలిమారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ మహిళలు, పిల్లలు, దివ్యాంగుల సంక్షేమ కోసం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పద్మానగర్ ఏఎన్ఎం ఉషారాణి, సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మరుపూరి హేమశేఖర్, రిటైర్డ్ టీచర్ శివగంగ, కో ఆర్డినేటర్స్ తేజోవతి, హరిబాబు, ఆశా వర్కర్లు జహరాబీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం ధర్మశాల ఎమ్మెల్యే సుధీర్ శర్మ, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ ఎమ్మెల్యే ఆశిష్‌శర్మ దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

క్లస్టర్ రైల్వే స్టేషన్‌గా తిరుచానూరు అభివృద్ధి

రేణిగుంట: తిరుపతి రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను క్లస్టర్ స్టేషన్‌గా అభివృద్ధి చేసినట్టు రైల్వే సీసీఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి వారాంతరపు రైళ్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం చెన్నై, అరక్కోణంకు రెండు రోజువారీ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. దశలవారీగా మరో 10 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో పిట్ లైన్లు, స్టెబ్లింగ్ లైన్లు ఏర్పాటు చేసి, తిరుపతి స్టేషన్‌పై ఆపరేషనల్ ఒత్తిడిని తగ్గించనున్నట్టు తెలిపారు. ప్రయాణికులు తిరుచానూరు స్టేషన్‌లో సవరించిన సమయాలను ముందుగానే చెక్ చేసుకోవాలని సూచించారు.

బాలికలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి

శ్రీకాళహస్తి: కిశోర బాలికలు ఆరోగ్యంపై దృష్టిసారించాలని సీడీపీవో శాంతిదుర్గ తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, ఆరోగ్యం, పోషణ, విద్య, అభివృద్ధి, సాధికారత, స్వీయ రక్షణపై అవగాహన కల్పించారు. వన్ టౌన్ సీఐ గోపి మాట్లాడుతూ బాలికలు బలంగా ఉండాలని, తల్లిదండ్రులు, టీచర్స్‌తో మంచిగా మెలగాలని సూచించారు. ఎంఈవో బాలయ్య, మెడికల్ ఆఫీసర్ గిరిజ మాట్లాడుతూ గుడ్ టచ్, బాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ అధికారిణి దేవయాని మాట్లాడుతూ ప్రతి బాలికకు భద్రత, విద్య, ఆరోగ్యకరమైన జీవితం పొందే హక్కు ఉందని గుర్తు చేశారు. సమాజంలో బాలికల పట్ల ఉన్న ప్రతికూల ఆలోచనలను మార్చడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుచరిత, మునికోకిల పాల్గొన్నారు.

గిరిజన మహిళపై దురుసు ప్రవర్తన తగదు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ మంగమ్మపై తహశీల్దార్ శ్రీదేవి దురుసు ప్రవర్తన దారుణమని శుక్రవారం యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జునరావు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 269-1 భూసమస్యపై జిల్లా యానాది సంఘం నాయకులతో కలసి వెళ్లిన యానాది మహిళ, వృద్ధురాలైన మంగమ్మను తహశీల్దార్ శ్రీదేవి తీవ్ర పదజాలంలో దూషించడం సరికాదన్నారు. న్యాయం కోసం వచ్చిన గిరిజన మహిళను అవమానించడం దారుణమని తెలిపారు. తహశీల్దార్ తీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ అత్తూరు చెంగల్‌రాయులు, మాజీ డీవీఎంసీ నెంబర్ మోపూరు అడివయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు కల్పన, శీనయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ


రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: మండలంలోని మామండూరులో గత మామిడికాయల సీజన్లో ఏనుగులు మామిడి తోటలను ధ్వంసం చేసి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. 16 మంది రైతులకు ప్రభుత్వం రూ.2,25,500లను పరిహారంగా మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గ్రామానికి చేరుకొని రైతులకు చెక్కులను పంపిణీ చేశారు. ఏనుగుల వల్ల సుమారు 30 మంది నష్టపోయారని, 16 మందికే చెక్కులు వచ్చినట్టు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. రీ వెరిఫికేషన్ చేసి రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ముని చంద్రారెడ్డి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించండి


ముడి సరుకులను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ

నారాయణవనం: అంగన్‌వాడీ కేంద్రాలను బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ వసంతాభాయ్ సూచించారు. శుక్రవారం మండలంలోని వెత్తపతడుకు బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, ప్రభుత్వం సరఫరా చేస్తున్న స్టాక్‌ను పరిశీలించారు. ఆమె సిబ్బందికి సూచనలు చేస్తూ కేంద్రాన్ని సందర్శించే వారి పెరుగుదల అభివృద్ధిని క్రమం తప్పకుండా పరిశీలించి సలహాలను ఇవ్వాలని అన్నారు. పౌష్టికాహారం లబ్ధిదారులకు వందశాతం చేర్చాలని అన్నారు. కిశోర బాలికలు, గర్భవతులు, బాలింతలతో సమావేశాలను నిర్వహించి ఆరోగ్య, ఆహారపు అలవాట్లపై నిపుణులతో సూచనలు చేయించాలని ఆమె ఆదేశించారు. కాలం చెల్లిన పోషక పదార్థాలను వినియోగించకుండా జాగ్రత్త తీసుకోవాలని వసంతభాయ్ సూచించారు.